ప్రజాశక్తి

సోమవారం 15 డిసెంబర్ 2025 8 పేజీలు




గుంటూరు పల్నాడు

జూదంలా సేద్యం

- పత్తి, వరికి కనీస మద్దతు ధర దక్కక రైతులకు పెరిగిన కష్టాలు
- గత సీజన్‌లో మిర్చి రైతులను ఆదుకోని ప్రభుత్వం
- ఇప్పటికీ పూర్తి కానీ పొగాకు కొనుగోలు




పెదకాకాని మండలంలో ధాన్యం విక్రయం.. గణపవరంలోని పత్తి కొనుగోలు కేంద్రంలో రైతుల ఫిర్యాదు నేపథ్యంలో ఇటీవల పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టిపట్టన్నట్టు వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన కనీస తోడ్పాటు రైతులకు అందడం లేదు. ప్రధాన పంటలు సాగు చేస్తున్న రైతులంతా మద్దతు ధరలు దక్కక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి, పత్తి, విక్రయానికి రెండేళ్లుగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరో వైపు చీడ పీడల ప్రభావంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

ఈ ఏడాది డెల్టాలో 70 వేల ఎకరాల్లో వరి పైరు అధిక వర్షాలకు కొట్టుకుపోయింది. నాలుగు మండలాల పరిధిలో ఒక్క రైతుకు కూడా పరిహారం రాలేదు. రెండు సార్లు సాగు చేసినా తగిన ప్రయోజనం రాలేదు. మిగతా ప్రాంతాల్లో ధాన్యం చేతికి వచ్చినా తేమ శాతం సాకుగా చూపి కొనుగోలు చేసేవారే లేరు. నిల్వ చేసుకునే సౌకర్యం లేక, ఆరబెట్టుకునేందుకు అవకాశం లేక రైతులు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. పొన్నూరు ప్రాంతంలో గత నెలలో తొలి విడత నూర్పిడి చేసిన వారంతా బస్తారూ.1300కు అమ్ముకున్నారు. కనీస మద్దతు ధర ప్రకారం రూ.1792కు కొనుగోలు చేయాల్సిన అధికారులు తేమ శాతం అధికంగా ఉందని ఆరబెట్టుకోవాలని సూచించారు. దీంతో ఆరబెట్టుకునేందుకు అవకాశం లేక రూ.1300కు విక్రయించారు. తాజాగా పెదకాకాని మండలంలో ధాన్యం బస్తా రూ.1400కు మిర్యాలగూడ నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. పత్తి విషయంలో ఇప్పటికీ ఆంక్షలు కొనసాగుతున్నాయి. తేమ శాతం 8 నుంచి 12 శాతం లోపు ఉండాలని నిబంధనలు రైతులకు శరాఘాతంగా మారాయి.

ఇటీవల సంభవించిన మొంథా తుపారె వల్ల పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. పల్నాడు, గుంటూరు జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో చేతికి అందివచ్చిన పంట దెబ్బతింది. ఈ ఏడాది సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తెచ్చిన స్లాట్ సిస్టమ్ వల్ల రైతులు పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. పల్నాడులోని పిడుగురాళ్ల, నడికుడి, నరసరావుపేటలో ఉన్న 4 జిన్నింగ్ మిల్లుల్లో 5450 క్వింటాళ్ల ప్రత్తి ప్రాసెస్ చేయగల సామర్థ్యం ఉండి కూడా 3550 క్వింటాళ్లకు మించి ప్రాసెస్ చేయకపోవడం వల్ల కొనుగోలులో జాప్యమవుతోంది. సిసిఐ అన్ని జిన్నింగ్ మిల్లుల్లో స్లాట్లను పొడిగించాలని రైతులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. పత్తి తేమ విషయంలో విధించిన నిబంధనలను 18 శాతానికి సడలించాలని కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తేమ అధికంగా ఉందనే సాకుతో వ్యాపారులు ▶ 2లో


భార్యను చంపి శవంతో స్టేషన్‌కు

- బతిమాలి పిలిచి.. ఆపై గొంతుకు చలికోటు లేసు బిగించి హత్య
- మాచవరంలో ఘటన - పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వెట్టర్ లేసును భార్య గొంతకు చుట్టి హత్య చేయడంతోపాటు ఆమె మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై పెట్టుకుని వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు భర్త. రొంపిచర్ల మండలం మాచవరం గ్రామంలో ఆదివారం కలకలం సృష్టించిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన ▶ 2లో





మహాలక్ష్మీ మృతదేహం.. మృతురాలు, నిందితుల ఫైల్ ఫొటోలు

జెండాల ఆవిష్కరణలో నాయకులు



యాప్‌ల భారంతో బోధనకు దూరం

యుటిఎఫ్ గుంటూరు జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు - ఓపీఎస్ అమలుకు డిమాండ్ - పలు సమస్యలపై తీర్మానాలు ఆమోదం

5 లో



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

నగర సమస్యలపై పౌర నిఘా అవసరం

రేట్ పేయర్స్ అసోసియేషన్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ఎదుర్కొంటున్న తాగునీటి, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి పౌరసంస్థలతో కూడిన పౌరనిఘా అవసరమని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి అన్నారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గుంటూరులోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధిలో పౌరసంస్థల భాగస్వామ్యంపై సదస్సు ఏర్పాటు చేయగా నారాయణరెడ్డి మాట్లాడుతూ నగరంలో రక్షితనీటి సరఫరాలోని లోపాల కారణంగా ప్రజలు మృత్యువాత పడిన సందర్భాలు అనేకం ఉన్నాయని, ప్రకాశం బ్యారేజీ నుండి మంగళగిరి వరకు కొంతమేర ఉన్న ఓపెన్‌ఛానల్ వల్ల నీరు వ్యర్థాలతో కలుషితమవుతోందని, కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి నెల శుభ్రపరచకపోవడం వలన గుంటూరు నగర ప్రజలు రక్షిత మంచినీటికి నోచులేక పోతున్నారని వివరించారు. 10కి పైగా ఓవర్ హెడ్ ట్యాంకుల పైకప్పులు పడిపోవడం వల్ల పక్షులు, కోతుల వ్యర్థాలు, కళేబరాలతో నీరు కలుషితమవుతోందని చెప్పారు. వీటికి యుద్ధ ప్రాతిపదికన ప్రత్యమ్నాయ మార్గాలను చూపాలన్నారు. గుంటూరు కార్పొరేషన్ సిబ్బంది అవినీతి, అలసత్వం వల్ల నగర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 80 శాతానికిపైగా జబ్బులు కలుషిత నీరు, కలుషిత ఆహారం వల్ల వస్తున్నాయని, నగర ప్రజలకు రంగు, వాసన లేని స్వచ్ఛమైన ▶ 2లో

కానిస్టేబుల్ అభ్యర్థులకు రేపు నియామక పత్రాలు

మంగళగిరిలో ఇవ్వనున్నసిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఐజి ఏసుబాబు, జిల్లా ఎస్‌పి వకుల్‌జిందాల్ తదితరులు ఆదివారం పరిశీలించారు. మంగళగిరిలోని ఎపిఎస్‌పి బెటాలియన్‌లో మంగళవారం సిఎం చంద్రబాబు నియామక పత్రాలను అభ్యర్థులకు అందచేస్తారు. స్టేజీ నిర్మాణం, సభా వేదిక వద్ద భారీ కేడింగ్ ఏర్పాట్లు, రాకపోకల మార్గాల ఏర్పాటు, అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులకు కల్పిస్తున్న వసతులు, సభా ప్రాంగణానికి వచ్చే వెళ్లే మార్గాలు, సూచిక బోర్డులు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు తదితర అంశాలపై అధికారుల సమీక్షించారు. విఐపిల భద్రత దృష్ట్యా సభా వేదిక వద్ద ఇన్నర్, ఔటర్ కార్డన్ బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. పరిశీలనలో అదనపు ఎస్‌పి జి.వి.రమణమూర్తి, ఎటివి రవికుమార్, ఎ.హనుమంతు, డిఎస్‌పిలు శ్రీనివాసులు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

డ్రగ్స్ కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి- తాడేపల్లి



విలేకర్లతో మాట్లాడుతున్న నేతాజి

జిల్లాలో, ముఖ్యంగా గుంటూరు నగరంలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలు యథేచ్ఛగా సరఫరా కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. తాడేపల్లికి ఆదివారం వచ్చిన ఆయన స్థానిక మేక అమరారెడ్డి భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలపై పోలీస్ యంత్రాంగం గట్టి నిఘా పెట్టి అరికట్టాలన్నారు. ఇటీవల జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో డ్రక్స్ అమ్మకాలు, వినియోగం భారీ స్థాయిలో విస్తరించినట్లు వార్తలొస్తున్నాయని, యువత, విద్యార్థులనే లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా చేసుకుందని అన్నారు. భావి భారత పౌరులుగా ఎదగాల్సిన వారు డ్రగ్స్ బారినబడి జీవితాలు అతలాకుతలం చేసుకుంటున్నారని, కుటుంబాలు తీవ్రమైన అలజడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ విద్యార్థిని తల్లి ఈ సంఘటనలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమన్నారు. యువకులకు మత్తుమందులు సరఫరా చేసే ముఠాలో బిజెపి అనుబంధం విద్యార్థి సంఘమైన ఎబివిపి నాయకులు కొంతమంది ఉన్నట్లు వార్తలొస్తున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలు అమ్మకాలు సాగిస్తున్న వారందరినీ అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మాఫియా ఉచ్చులో పడ్డవారిని గుర్తించి, వారిని ఆ ఉచ్చు నుండి బయటకు తేవడానికి ప్రత్యేకమైన డ్రైవ్ నిర్వహించాలని, కౌన్సెలింగ్, చికిత్స కేంద్రాలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో నాయకులు జి.సుబ్బారెడ్డి, డి.కోదండరామయ్య పాల్గొన్నారు.



రాయపూడిలోని ఒ ఇంటి వద్ద ఉంచిన బియ్యం మూటలు

జోరుగా రేషన్ దందా

ప్రజాశక్తి - తుళ్లూరు

పేదల కడుపునింపేందుకు ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా ఎలాంటి అడ్డంకులూ లేకుండా సాఫీగా సాగుతోంది. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తే ఆ తరువాత రోజు నుంచి నెలాఖరు వరకు లబ్ధిదారుల నుంచి అక్రమార్కులు రూ.10-15 చొప్పున జోరుగా అక్రమ కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని సంచుల్లో నింపి ఒకచోట ఉంచి అనువైన సమయంలో అక్కడ నుంచి తరలిస్తున్నారు. మండలంలోని రాయపూడిలో ఒక ఇంటి వద్ద బియ్యం మూటలుగా కట్టి ఉంచడం రేషన్ దందాకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఒక్క రాయపూడిలోనే కాకుండా మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో రేషన్ దందా సాగుతోందని పెద్ద ఎత్తున ప్రచారమవుతోంది. ప్రభుత్వ విభాగాల్లోని కొందరు అధికారుల అండదండలతో రేషన్ బియ్యం అక్రమ రవాణా మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతూ అక్రమార్కులకు ఎదురు లేకుండా పోయిందన్న ఆరోపణలు వినబడుతున్నాయి.

నేటి ఎస్పీ గ్రీవెన్సు రద్దు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్సు కార్యక్రమాన్ని ఈ సోమవారం రద్దు చేసినట్టు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

జూదంలా సేద్యం

(మొదటి పేజీ తరువాయి)

క్వింటాళ్‌కు 5 కిలోలు కోత విధిస్తున్నారని రైతులు వాపోయారు. కనీస మద్దతు ధర కన్నా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మిర్చి దిగుబడి ఇంకా ప్రారంభం కాకపోయినా గతేడాది పంటలను గుంటూరు పరిసరాల్లోని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్నాయి. తాజాగా రాయలసీమ నుంచి కొత్తసరుకు వస్తుండటంతో వ్యాపారులు ధరలు స్వల్పంగా పెంచారు. గత సీజన్‌లో బర్లీ పొగాకు కొనుగోలులో జాప్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికీ పొగాకు కొనుగోలు పూర్తికాలేదు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం పొగాకు రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారు. మిర్చి విషయంలో కూడా ప్రభుత్వం రైతులను ఏమాత్రం ఆదుకోకుండానే సీజన్ ముగిసింది. ఈ ఏడాది మిర్చి రైతులు ఒక్కొక్కరు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. ప్రభుత్వం రూ.11,781 కన్నా ధర తగ్గితే ఆదుకుంటామని చెప్పినా ఒక్క రైతును కూడా ఆదుకోలేదు. రైతులకు సాయంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితం అయ్యాయి. 2019 నుంచి 2024 వరకు క్వింటాళ్‌కు కనిష్టంగా రూ.18 వేలు, గరిష్టంగా రూ.28 వేల వరకు ధరలు లభించాయి. కానీ ఈ ఏడాది కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.13 వేలు మాత్రమే లభించినా మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం ద్వారా ప్రభుత్వం రెతులను ఆదుకోలేదు.



పరిశ్రమలను పిలిస్తే సరిపోదు.. భూములూ ఇవ్వాలి..

అమరావతిలో హైదరాబాద్ తరహా అభివృద్ధి - మోతడకలో త్వరలో రూ.5 కోట్లతో పికిల్ క్లస్టర్ : కేంద్ర మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



అమరావతిలో కూడా హైదరాబాద్ తరహాలో అభివృద్ధి జరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో రూ.2.3 కోట్లతో వివిధ కమ్యూనిటీ హాల్స్‌ను ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆదివారం ప్రారంభించిన చంద్రశేఖర్ మాట్లాడుతూ... హైదరాబాదులో హైటెక్ సిటీ ప్రారంభించడానికి ముందు ఎకరం రూ.2 లక్షలు ఉండగా, ఇప్పుడు హైటెక్ సిటీకి 50 కిలోల మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతంలోను ఒక్కో ఎకరం రూ.3 కోట్లు పలుకుతోందన్నారు. త్వరలో అమరావతి ప్రాంతంలో కూడా అలాంటి పరిస్థితి రాబోతుందని ప్రజలు గుర్తించాలన్నారు. తొలి విడత భూ సమీకరణ చేపట్టిన 29 గ్రామాల్లో కూడా రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, శ్మశాన వాటికలు, యుజిడి వంటి మౌలిక సదుపాయాల ద్వారా పట్టణాలతో సమానంగా అభివృద్ధి చెందబోతున్నాయన్నారు. త్వరలో మోతడకలో రూ.5 కోట్లతో పికిల్ క్లస్టర్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రైతులు అమరావతికిచ్చిన భూముల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడితో పనులు జరుగుతున్నాయని చెప్పారు. 2014లో విశాఖలో అభివృద్ధి చేశారనే ఉద్దేశంతో, అక్కడి ప్రజలు 2019లో కూడా నాలుగు ఎమ్మెల్యే సీట్లను అందించారని తెలిపారు. అలాంటి విశాఖపట్టణంలో ప్రస్తుతం ఎన్నో ఇండస్ట్రీలు, ఏకంగా గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. పెరిగిన పోటీతత్వంతో పరిశ్రమలను ఆహ్వానిస్తే సరిపోదని, వారికి కావాల్సిన సౌకర్యాలు, భూమి, సబ్సిడీ తదితరాలు కల్పించగలిగితేనే వస్తాయని అన్నారు. అమరావతిలో కొందరు రైతులు పడుతున్న ఇబ్బందులకు కిందిస్థాయి ఉద్యోగులు చేసిన కొన్ని పొరపాట్లు కూడా కారణం కావొచ్చని, అమరావతిని చట్టబద్ధం చేసేందుకు త్వరలోనే పార్లమెంటులో గెజిట్ ప్రవేశ పెట్టించ పోతున్నామని చెప్పారు. గుంటూరు వెంగళయపాలెం చెరువులో మేము చేసిన అభివృద్ధి కారణంగా దేశంలోనే ఒక మోడల్ చెరువుగా పేరు తెచ్చుకుందన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామానికి నిధులు ఏ మార్గంలో తీసుకురావాలి, ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలో ఆలోచించే నాయకత్వం ఉందని, కైలాస సత్రం, బిసి, ఎస్సి, ఓసి కమ్యూనిటీ హాల్లో తదితర నిర్మాణాలు ఇందుకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల శివరామయ్య, ఎడ్లపల్లి సాంబశివరావు, తలసిల ప్రసన్న, సర్పంచ్ ఎడ్లపల్లి పద్మావతి, నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ విజయ శేఖర్, బిజెపి ఇంచార్జ్ కంతేటి బ్రహ్మయ్య, టిడిపి సీనియర్ నాయకులు శేషయ్య పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జిని సకాలంలో పూర్తి చేస్తాం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని శంకర్ విలాస్ ఆర్‌వోబి నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. గుంటూరులో ఆదివారం ఆయన్ను కలిసిన మీడియాతో మంత్రి మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ తొలగింపు క్లిష్టమైన సాంకేతిక సమస్యని, ప్రతి గంటకు అనేక రైళ్లు వెళ్లే మార్గంలో వాటికి ఆటంకం లేకుండా బ్రిడ్జ్ తీసేయాల్సి ఉందని అన్నారు. ఈ స్థాయి నైపుణ్యం దేశంలో కేవలం రెండు మూడు ఏజెన్సీలకే ఉందన్నారు. మొదట మాట్లాడిన ఏజెన్సీ 35 రోజులు సమయం కోరగా అంత సమయం ఇవ్వడం ఇబ్బందికరమని రైల్వే అధికారులు చెప్పారన్నారు. రైల్వే సూచన మేరకు మరో ఏజెన్సీని సంప్రదించగా వారు స్థలాన్ని పరిశీలించి వెళ్లారని ఇంకా గడువు నిర్దేశించలేదని తెలిపారు. తుది నిర్ణయమయ్యాక ఒకటి రెండు నెలల్లో బ్రిడ్జి తొలగింపు పూర్తవుతుందన్నారు. మిగిలిన అభివృద్ధి పనులకు ఎక్కడా అడ్డంకి లేకుండా ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు రెండు వైపులా కాకుండా ముందుగా ఒక వైపు పూర్తిగా పనులు చేస్తున్నామని, ఒక వైపు పనులను వేగంగా పూర్తి చేస్తే ప్రయాణికులకు ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. డిసెంబర్ 15 నాటికి ఒక వైపు పూర్తవ్వాల్సి ఉండగా స్వల్ప ఆలస్యం వల్ల డిసెంబర్ 17 నాటికి ఇస్తామని చెప్పారు. గతంలో ఫ్లైఓవర్ అంచనాలు ఎక్కువగా వేశారని, కానీ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మాత్రమే నిర్మిస్తున్నామని అన్నారు. భూ సేకరణ ఖర్చును మున్సిపాలిటీ పరిధిలో పెట్టి ఇప్పటికే చాలామందికి చెక్కులు, టిడిఆర్ బాండ్లు ఇచ్చామన్నారు. కొద్ది మందితో ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించే ఉద్దేశంతో ఉన్నామన్నారు. వైసిపి నాయకుల అనవసర వ్యాఖ్యలు, వ్యక్తిగత ఆరోపణలకు స్పందించాల్సిన అవసరం లేదన్నారు.

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచకాలకు జగనే బాధ్యుడు : బుద్దా వెంకన్న

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట రామిరెడ్డి ఇద్దరు నరరూప రాక్షసులైతే, పులివెందుల ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ రెడ్డి మరోరకం రాక్షసుడని, అందుకే వారి అరెస్ట్‌ను రాష్ట్ర ప్రజలందరూ స్వాగతిస్తురని, మాచర్ల నియోజకవర్గ ప్రజలు దీపావళి పండుగ జరుపుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు.



పిన్నెల్లి సోదరుల అరెస్ట్‌కు సంఘీభావంగా జగన్‌మోహన్‌రెడ్డి కొవ్వొత్తుల ప్రదర్శనకు పిలుపునివ్వటాన్ని ఖండిస్తూ ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిన్నెల్లి సోదరులు మున్సిపల్ ఛైర్మన్ కోసం వేలం పాట పెట్టి దాడులు, హత్యలు చేయించిన దుర్మార్గులు అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో పిన్నెల్లి సోదరులను అరెస్టు చేస్తే... ఇది అక్రమ నిర్బంధం అనటం జగన్‌కి చట్టాలపై ఎంతో గౌరవం ఉందో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో టీడీపీ మద్దతు దారులను చంపేయాలని లక్ష్యంగా పెట్టుకొని పిన్నెల్లి బ్రదర్స్ వ్యవహరించారన్నారు. తనపై, బొండా ఉమామహేశ్వరరావు దాడి చేయించారన్నారు. జై వైసిపి అనలేదని చంద్రయ్య గొంతు కోసి చంపేశారన్నారు. ఇద్దరు వ్యక్తులను అత్యంత కిరాతకంగా చంపిన వారిని అరెస్టు చేస్తే.. జగన్ సంఘీభావం ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. రౌడీ షీటర్లు, దుర్మార్గులకు అండగా ఉంటూ వారిని కాపాడుతున్న జగన్‌కు, వైసిపికి అడ్రస్ లేకుండా చేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.

నగర సమస్యలపై పౌర నిఘా అవసరం

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటిని అందించాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉందని అన్నారు. ప్రజలపై పన్నుల భారాన్ని పెంచుతున్నా కనీస సదుపాయాలు కల్పించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ బలమైన పౌర సమాజాన్ని నిర్మించి పౌర సంస్థల ఐక్య కృషితో అవినీతికి వ్యతిరేకంగా పని చేయాలన్నారు. గుంటూరు నగరంలో దాదాపు 20 పౌర సంస్థలు వివిధ కోణాల్లో కృషి చేస్తూ ప్రజాభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్ మాట్లాడుతూ సమాజంలో నేడు ఏదైనా కరువైందంటే అది సామాజిక బాధ్యతేనని, సమాజం పరిపూర్ణంగా, పరిపక్వంగా ఉండాలంటే నైతిక, సామాజిక విలువలు పెంపొందించాలని అన్నారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షులుగా పరుచూరి పరందామయ్య, అధ్యక్షులుగా ఓరుగంటి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా రేకపల్లి రామ్‌కుమార్, బి.సురేష్‌బాబు, వి.వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.రాఘవరావు, కార్యదర్శులుగా టి.ధనుంజయరెడ్డి, సిహెచ్.శివాజీ, కె.పావని, కోశాధికారిగా ఎన్.ఆనందకృష్ణతోపాటు మరో 34 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వివిధ సంస్థల నాయకులు జలీల్ అహ్మద్, పావులూరి రమేష్, కొండా శివరామిరెడ్డి, ఎల్.ఎస్.భారవి, సిహెచ్.పరమేశ్వరరెడ్డి, డి.వెంకటేశ్వర్లు, టి.చంద్రశేఖర్‌రెడ్డి, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

భార్యను చంపి శవంతో స్టేషన్‌కు

(మొదటి పేజీ తరువాయి)

అల్లాడి వెంకటేశ్వర్లు ఆలియాస్ వెంకటేష్‌కు రొంపిచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన మహాలక్ష్మీ (24)తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. బావ లైంగిక వేధింపులు, ఆడపడుచుల వేధింపులు తాళలేక మహాలక్ష్మీ కొన్ని నెలల క్రితం భర్త, పిల్లలను వదిలి మాచవరంలోని పుట్టింటికి వచ్చి తల్లిదండ్రుల వద్దే ఉంటూ కూలి పనులకు వెళ్తున్నారు. దీంతో కొన్ని రోజుల క్రితం వెంకటేష్ మాచవరానికి వచ్చి కుటుంబీకులు, పెద్దల సమక్షంలో మాట్లాడి మహాలక్ష్మీని తీసుకెళ్లాలని చూసినా ఆమె నిరాకరించారు. దీంతో ఆదివారం తెల్లవారుజామున 6 గంటలప్పుడు మహాలక్ష్మీకి వెంకటేష్ ఫోన్ చేసి.. తాను మాచవరం ఊరి బయట వాటర్ ప్లాంటు వద్ద ఉన్నానని, ఒక్కసారి మాట్లాడి బంగారం ఇచ్చి వెళ్తానని, ఒంటరిగా రావాలని అడిగాడు. ఈ విషయాన్ని మహాలక్ష్మీ తన తల్లికి చెప్పగా ఆమె వద్దని వారించింది. దీంతో ఆమె వెళ్లకపోవడంతో వెంకటేష్ పదేపదే ఫోన్ చేసి బతిమాలడంతో ఆమె వెళ్లగా వెంకటేష్.. తాను వేసుకున్న చలికోటుకున్న లేసును తీసి మహాలక్ష్మీ గొంతుకు చుట్టి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని తన ద్విచక్రవాహనంపైనే పెట్టుకుని నేరుగా సంతమాగులూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. దీనిపై రొంపిచర్ల పోలీసులకు సంతమాగులూరు పోలీసులు సమాచారం ఇచ్చి నిందితుణ్ణి అప్పజెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడు ప్రస్తుతం రొంపిచర్ల పోలీసుల అదుపులో ఉన్నాడు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేశారు.

బార్లా తెరుచుకుంటున్న బార్లు





ప్రజాశక్తి-తాడేపల్లి


తాడేపల్లి పట్టణంలో మందు బాబులకు కిక్కిచ్చేందుకు బార్లు తెల్లవారుజామునే బార్లా తెరుచుకుంటున్నాయి. సమయ పాలన లేకుండా యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగిస్తు న్నారు. మద్యం విక్రయాలతో పాటు బెల్ట్ షాపులు పట్టణంలో పుట్ట గొడుగుల్లాగా వెలిశాయి. తాడేపల్లి పట్టణ ప్రాంతాల్లో సుమారు200 చోట్ల బెల్టు స్వైర విహారం చేస్తుంది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లల్లోనే మద్యం విక్రయాలు జోరుగా కొనసాగు తున్నాయి. హోటళ్లలో టీవీక్రయిస్తున్నట్టు మద్యం విక్రయిస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలు వీరికి పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. బెల్టును అరికట్టవలసిన ఎక్సైజ్ పోలీసులు చూసి చూడనట్టు వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

సమయపాలన లేకుండా మద్యం విక్రయాలు

సీఎం చంద్రబాబు నాయుడు నివాస్ ప్రాంతం ఉన్న తాడేపల్లి పట్టణం మరియు రూరల్ పరిధిలో, విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ద్వారా మద్యం అమ్మకాలు, నివాసాల మధ్యలో మద్యం అమ్మ కాలు ఏమిటి అని అడిగిన కూడా పట్టించుకోని అధికారులు, ఈ విషయంపై స్థానికంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మద్యం మత్తు ఎక్కువై సీతానగరంలో ఓ వివాహిత ఇంటిపైకి ఓ వ్యక్తి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలు తెలిపింది. అర్ధరాత్రి, అపరాత్రి తేడా లేకుండా ముందు బాబులు మద్యం తాగి చిందు లేస్తున్నట్టు ప్రజల నుండి వినవస్తున్న మాట. అలాంటి వారితో తాము గొడవకు దిగులేమంటున్న స్థానికులు. ప్రభుత్వ అధికారులు, పోలీసులు దీన్ని అరికట్టాలని కోరుతున్నారు. కొన్ని సందర్భాలలో అడిగిన వారిపై కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్న అధికారులు తీరు ప్రశ్నార్థకంగా మారింది. తాడేపల్లి పరిధిలోని ఐ ఓసీ ఎదురు ఉన్న ఒక బార్లు ఉదయం 6 గంటలకే బార్లు తెచుకుని మద్యం విక్రియాలు కొనసాగించడం అధికారుల పనితీరుకు అర్థం పడుతుందని స్థానికుల ఎద్దేవా చేస్తున్నారు. హాస్పటల్లో దేవాలయాలు ఉదయాన్నే తెరుస్తారో లేదో తెలియదు గాని, మందుబాబులకి ఉదయాన్నే మద్యం అందుబాటులోకి తీసుకువచ్చి, ఈ ప్రాంతంలో పండగ వాతావరణం ఏర్పాటు చేస్తున్న బార్ యాజమాన్యం పై ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం పూర్తి అభివృద్ధి : మంత్రి పెమ్మసాని





ప్రారంభోత్సవాలు చేస్తున్న కేంద్ర,రాష్ట్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, వంగలపూడి అనిత.. మహిళలపై పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ప్రభుత్వం ద్వారా రెండు కోట్ల 45 లక్షల రూపాయల వ్యయంతో మేరీకపూడి నుంచి మునగపాడు గ్రామం వరకు 2.5 కిలోమీటర్లు దూరంలోలో నిర్మించిన ఆర్ అండ్ బి రోడ్డును, అలాగే గుండాలపాడు గ్రామంలో నిర్మించిన సచివాలయాలు హెల్త్ సెంటర్ లను ఎంపీ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఆదివారం ప్రారంభోత్సవ కార్యక్రమాలు గావించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండు గ్రామాల ప్రజలు పూల వర్షంతో ఘనంగా స్వాగతించారు. అనంతరం గుండాలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా కార్యక్రమంలో ఎంపీ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసం వేలకోట్ల రూపాయలు కూటమి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అందించి పేదరిక నిర్మూలన కోసం ఎంతో కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. 2019లో కూటమి ప్రభుత్వం గెలుపు కోసం మంచి మెజార్టీ తీసుకొచ్చిన ఫిరంగిపురం మండల ప్రజలకు ముఖ్యంగా గుండాలపాడు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. పేద విద్యార్థుల కోసం కాలేజీలు, పేద కుటుంబాల కోసం గ్యాస్, రేషన్ ఉచిత బస్ వంటి ఎన్నో సంక్షేమ ఫలాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి సేవలను గుర్తించాలని చెప్పారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం సమన్వయంతో నిరంతరం కృషి చేస్తున్నారని తెలియ జేశారు. పొనుగుపాడు గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి మూడు నెలలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నియోజవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకొని బురద రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చడానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేసింది అని గుర్తు చేశారు. నియోజకవర్గంలో రోడ్లు తాగునీటి సమస్యలను నిర్మూలించామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందు ఒదని కండ్రిగ, గుండాలపాడు గ్రామాల్లో తాగునీటి సరఫరా కోసం సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, తాడికొండ నియోజకవర్గ బిజెపి ఇన్ చార్జి బ్రహ్మయ్య, జనసేన ఇన్ చార్జి యువకుడు విజయ శేఖర్, మండల టిడిపి అధ్యక్షులు మండల నరసింహారావు, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, ఎర్రగుంట్ల పాడు గ్రామ సర్పంచ్ జనసేన జిల్లా నాయకులు కేశవ, మునగపాడు ఉపసర్పంచి షేక్ నూర్జహాన్, గుండాలపాడు గ్రామ సర్పంచ్ కాండ్రు దాసయ్య, గుండాల పాడు ఎంపీటీసీ కట్టా ప్రసాద్, శివరామయ్య, ఆళ్లకృష్ణమూర్తి, మహమ్మద్ యాకూబ్, కట్టా అశోక్, శ్రీకాంత్, బేతపూడి సొసైటీ ప్రెసిడెంట్ కూరపాటి మాబు, మండల అధికారులు జె.సాదరావు, ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ అధికారి వాసంతి, డ్వాక్రా సమైక్యమండలి ఏపిఎం నాగేశ్వర రావు, తదితర నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 332 మందికి పోలీస్ అధికారులు అవగాహన కల్పించి, రోడ్లపై అనవసరంగా తిరుగుతున్న కొంతమంది ఆకతాయిల కూడా కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో మహిళలు మరియు ఆడపిల్లల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా శక్తి బ ందాలు, ప్రత్యేక పోలీస్ బ ందాలు మరియు నిఘా వర్గాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టి, మహిళలు మరియు చిన్నారుల భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. స్కూళ్లు, కాలేజీలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ప్రధాన రహదారులు, షాపింగ్ మాల్స్, మార్కెట్లు, సినిమా హాళ్లు,అపార్టుమెంట్లు, బస్టాండ్లు మరియు రైల్వే స్టేషన్ల పరిసరాలలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది నిరంతర గస్తీ నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా మహిళలు లేదా ఆడపిల్లలపై అసభ్యకరంగా ప్రవర్తించడం, గోప్యతకు భంగం కలిగించడం లేదా అసాంఘిక చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకుని, అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ గారు తెలిపారు. ఏ రూపంలోనైనా ఈవ్ టీజింగ్‌ను సహించేది లేదని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, రద్దీగా ఉండే ప్రజా ప్రదేశాలు మరియు ప్రధాన రహదారుల్లో ప్రత్యేక గస్తీ, ఆకస్మిక తనిఖీలు నిఘా ఉంచామన్నారు.

బైక్ ఢీకొన్న ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - తెనాలి

బైక్ ఢీకొని బాలుడు గాయపడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక ఐతానగర్‌కు చెందిన ఐదేళ్ల బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన సముద్రాల చంటి బైక్ తో ఢీ కొట్టడంతో గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు బాలుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలుడి తండ్రి మహేష్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

మహిళపై దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక మల్లిపాడు గ్రామానికి చెందిన చావలి రాజమ్మ, ఆమె బావ యేసోబుకు స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9న రోజమ్మపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసారు.

అభివృద్ధికి అడ్డుపడితే ఎవర్నీ ఉపేక్షించం : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - రెంటచింతల

మాచర్ల నియోజకవర్గంలో వేల కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడితే ఎవరినీ ఉపేక్షించమని, విష ప్రచారంతో కారుకూతలు కూస్తే నాలుక కోస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పాలువాయి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అరాచకాల వద్దు.., అభివృద్ధే ముద్దు అంటూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగిస్తున్న జైత్ర యాత్రపై వైఎస్‌ఆర్‌సిపి విషప్రచారం చేస్తుందని, మండిపడ్డారు. అభివృద్ధి నినాదంతో 2024 ఎన్నికల్లో ఘన విజయం కట్టబెట్టిన ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నేడు కూటమి ప్రభుత్వం నెరవేర్చుతోందని వివరించారు. పల్లె నుంచి పట్టణం వరకు విధ్వంసమైన రోడ్లన్నీటిని నేడు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, ఆధునికరిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంతో పాటు కార్మిక, కర్షక, ఉద్యోగ, యువత సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ అడుగులు వేస్తుందని వెల్లడించారు. మరో ఏడాదిలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలను అందజేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 150 ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదినరలో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందని, ఇప్పటికే రూ. 25 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు ఏపీకి క్యూ కట్టడం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తీసుకొస్తున్న నూతన పారిశ్రామిక విధాలను నిదర్శనమన్నారు. వేధింపులు, సాధింపులు లేని స్నేహ భావ వాతావరణంలో కూటమి ప్రభుత్వం అన్ని సంస్థలతో ఎంవోయూలు కుదిరించుకుంటుందని ఆయన చెప్పారు. యువత ఉద్యోగా, ఉపాధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సాగిస్తున్న పాలనను చూసి, వైసిపి కంటగింపుగా ఉండి విష ప్రచారం చేస్తుందని ఆయన దుయ్యబట్టారు.

ఫ్యాక్షన్ ఆలోచన వస్తే.. చిప్పకూడే గతి..!

పల్నాడు జిల్లా వ్యాప్తంగా వైసిపి చేస్తున్న కుట్రలు, కుతంత్రాలన్నీంటిని ప్రభుత్వం గమనిస్తూనే ఉందని.., ఫ్యాక్షన్ ఆలోచన చేస్తే ఎవరికైనా జైలు గతి పట్టించి, చిప్పకూడు తినిపిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రశాంతంగా ఉన్న పచ్చని పల్లెల్లో అలజడులు సృష్టించే ప్రయత్నం జరుగుతుందని, అటువంటి ప్రయత్నాలు మానుకోకపోతే చట్ట ప్రకారం శిక్షించి, జైలుకు పంపుతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు అంటే ప్రగతికి కేరాఫ్ గా నిలవాలే కానీ ఫ్యాక్షన్ కోరల్లో చిక్కుకోకూడదని సీఎం చంద్రబాబు సూచనలు మేరకు కట్టుబడి ఏడాదినర పాలనలో అభివృద్ధే లక్ష్యంగా పని చేశామని బ్రహ్మారెడ్డి చెప్పుకొచ్చారు. ఆనాడు మీకున్న అధికారమే నేడు మాకు ఉందని.., మేం తలుచుకుంటే ఏదైనా చేసే సత్తా ఉన్నా చంద్రబాబు శాంతి మంత్రమే తమకు శిరోధార్యమని జూలకంటి పునరుద్ఘాటించారు.

1100 కాల్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోండి : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



గ్రీవెన్స్‌లో ఇచ్చిన అర్జీల పురోగతిపై సమాచారం కోసం అర్జిదార్లు 1100 కాల్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. నరసరావుపేట కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) సోమవారం జరుగుతుందని, కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్ తీసుకురావాలని, మళ్లీ అర్జీలిచ్చేవారు పాత రసీదు తీసుకురావాలన్నారు. సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు సందేశం వస్తుందని, నోటీసులు, ఎండార్స్మెంట్‌ను వాట్సప్‌లో పంపిస్తున్నామని తెలిపారు. ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్‌కు పంపిస్తున్నామన్నారు.

రొంపిచర్ల ఎస్ఐగా లోకేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



శావల్యాపురం ఎస్ఐగా పనిచేస్తున్న లోకేశ్వరరావును రొంపిచర్ల స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన మణికృష్ణను గతంలోనే రాజుపాలేనికి బదిలీ చేయగా ఇన్‌ఛార్జి ఎస్ఐగా నరసరావుపేట రూరల్ ఎస్ఐ హరిబాబు వ్యవహరిస్తున్నారు.



బహుమతి అందుకుంటున్న సిరినందన

బాల మహోత్సవ్‌లో కె-రిడ్జ్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఈ నెల 12,13 తేదీల్లో నిర్వహించిన పల్నాడు రీజనల్ జోనల్స్ బాల మహోత్సవ్ పోటీల్లో నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని కె-రిడ్జ్ ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థిని ఎ.సిరినందన ప్రతిభ చూపారు. షాట్‌పుట్ అండర్-14 విభాగంలో ప్రథమ స్థానం సాధించి జోనల్ స్థాయి విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపల్ జి.బర్నబాస్ తెలిపారు. స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, తమ పాఠశాలలో క్రీడలకు ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్న తమ విద్యార్థులకు స్కూల్ తరపున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. సిరి నందనను స్కూల్ డైరెక్టర్ కోమటనేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, పీడీ సురేంద్ర, సురేష్, భవాని, ఉపాధ్యాయులుఅభినందించారు.

వచ్చే ఏడాది మరింత ఉత్సాహంగా బాలోత్సవం

ఆర్గనైజర్లు, దాతల అభినందన, సత్కార సభలో బాలోత్సవం నిర్వాహకులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలో గతనెల 29, 30 తేదీల్లో పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్నాడు బాలోత్సవం-3వ పిల్లల పండుగ సాంస్కృతిక పోటీల నిర్వహణకు సహకరించిన దాతలకు, ఆర్గనైజర్లకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో పల్నాడు బాలోత్సవం అధ్యక్ష,కార్యదర్శులు షేక్ మస్తాన్‌షరీఫ్, కట్టా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో దాతలను, ఆర్గనైజర్లను సత్కరించారు. మస్తాన్ షరీఫ్, కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న బాలోత్సవం పిల్లల పండుగ కార్యక్రమాల్లో పల్నాడు బాలోత్సవానికి అరుదైన గుర్తింపు లభించిందన్నారు. దేశ సంస్కృతీ సంప్రదాయాలు, కళలను ప్రోత్సహిస్తూ చిన్నారులలో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, స్నేహ భావం, అభ్యుదయ భావాలు నింపేందుకు బాలోత్సవాలు దోహదం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బాలోత్సవాల నిర్వహణపై దాతలు, ఆర్గనైజర్ల సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకుని వచ్చే ఏడాది నిర్వహించే పల్నాడు బాలోత్సవం 4వ పిల్లల పండుగను మరింత విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. 10 వేల మందికి పైగా చిన్నారులను సమీకరించి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం పట్ల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పల్నాడు బాలోత్సవాల గౌరవాధ్యక్షులు ఎంఎస్.ఆర్.కె.ప్రసాద్, బాధ్యులు ఏ.బాగేశ్వరిదేవి, షేక్ మహమ్మద్‌గౌస్, టి.అంజిరెడ్డి, పి.భీష్మారావు, ఎస్.ఎస్.ఎన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

ఎక్స్‌పర్ట్ అకాడమీ బ్రోచర్ ఆవిష్కరణ

డివైఎఫ్ఐ మాజీ నాయకుల ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలో నెలకొల్పిన ఎక్స్‌పర్ట్ అకాడమీ కోచింగ్ సెంటర్ బ్రోచర్‌ను బాలోత్సవం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అకాడమీ డైరెక్టర్లు శ్రీనివాసరావు, శివనాగు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలో సత్తెనపల్లి రోడ్డు లోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అకాడమీలో పల్నాడు జిల్లాలోని అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటు ఫీజులతో అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో ఎంసెట్, నీట్, పాలీసెట్, స్పోకెన్ ఇంగ్లీష్, జెఇఇ, తదితర పోటీ పరీక్షలకు, ఎంట్రన్స్ పరీక్షలకు కోచింగ్ ఇస్తామని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎపిఆర్‌జెసి వల్లే తాము ఉన్నత స్థానానికి

స్వర్ణోత్సవ సభలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఇతర ప్రముఖులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు

స్థానిక ఏపీఆర్జేసీలో చదవడం వల్లే తామంతా ఉన్నత స్థాయికి చేరుకున్నామని తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణరావు అన్నారు. ఏపీఆర్జేసి కళాశాలలో ఆదివారం జరిగిన స్వర్ణోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దశాబ్దాల తర్వాత అప్పటి స్నేహితులను కలుసుకొని కళాశాలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గురుకుల విద్యాలయాల్లో విద్యతోనే తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. జస్టిస్ తురకాంజీ మాట్లాడుతూ గురువులు ప్రోద్బలంతోనే తాము ఈ స్థాయికి చేరామంటూ భావోద్వేగం వ్యక్తం చేశారు. స్వర్ణోత్సవాలకు 3 వేల మంది పూర్వ విద్యార్థులు హాజరైనట్లు ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఏ.సైదారెడ్డి,కో-చైర్మన్ ఎస్.నాగాచారి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నేడు నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేటలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి కోటి సంతకాల సేకరణ ప్రతులు ఇప్పటికే జిల్లా కార్యాలయానికి చేరాయన్నారు. ఈ పత్రాలను నిరసన ప్రదర్శన అనంతరం తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి తరలిస్తామన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో 62 వేలకు పైగా సంతకాల సేకరించామని, జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల ప్రజల నుండి వచ్చిన స్పందన ద్వారా ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తేటతెల్లమైందని చెప్పారు.

పరిశ్రమలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి : ఎమ్మెల్యే

కెసిసి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన వారికి ఉచితంగా మిషన్లు పంపిణీ



శిక్షణ పొందినవారికి మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల

పరిశ్రమలు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు కంటున్న బంగారు కుటుంబాల కల సాకారం అవుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కేసీపీ సిమెంట్స్ ఆధ్వర్యంలో స్థానిక కేసీపీ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా 45 మంది శిక్షణ పొందిన మహిళలకు దాదాపు రూ.6 లక్షలతో సమకూర్చిన కుట్టు మిషన్లను ఉచితంగా అందజేశారు. వీటి ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతోపాటు ఆర్థికంగా సొంతకాళ్లపై నిలబడాలని, సాధికారత సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వ అండ, బ్యాంకర్ల ప్రోత్సాహం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కేసీపీ జీఎం వెంకటరమణ, హెచ్ ఆర్ మేనేజర్ ఉదయ్ కుమార్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మత్స్యకార కాలనీలో ముగింపు దశకు సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపురిసౌత్‌లోని మత్స్యకారుల సాగర్ క్యాంపు కాలనీతో పాటు డౌన్ మార్కెట్‌లో రూ.2.6 కోట్లతో గతనెల 5న ప్రారంభించిన సిసి రోడ్ల నిర్మాణం ముగింపు దశకు వచ్చాయి. ఆరు దశాబ్దాలుగా స్థానిక మత్స్యకారులు గోతులమయంతో ఉండే గ్రావెల్ రోడ్డుపై అవస్థలు పడుతూ ప్రయాణించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చొరవతో సాగర్ ప్రాజెక్టు కాలనీ రహదారులకు రూ.5 కోట్లు మంజూరవగా రూ.2.6 కోట్లతో మత్యకారుల కాలనీ రహదారి పనులను ప్రారంభించారు.

రూ.2.60 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ప్రజాశక్తి - రెంటచింతల

రూ.2.60 కోట్ల ఉపాధి హామీ, జిల్లా పరిషత్ నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం ప్రారంభించారు. రెంటాల గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించగా, రెంటచింతల రైలుపేటలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించనున్న రూ.44 లక్షల ఓవర్ హెడ్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. వైఆర్ఎస్ స్కూల్ పక్కన బీసీ కాలనీలో మరో రూ.15 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. మిట్టగుడిపాడు రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయగా, జెట్టిపాలెం, మల్లవరం గ్రామాల్లో రూ.20 లక్షల సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. పశర్లపాడులో రూ.10 లక్షలు, తుమృకోట గ్రామంలో రూ.15 లక్షలు, పాలువాయి గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. పాలువాయి జంక్షన్ నందు రూ.60 లక్షల జెడ్‌పి నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు.



యాప్‌ల భారంతో బోధనకు దూరం

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

విజయవంతంగా యుటిఎఫ్ 51వ జిల్లా కౌన్సిల్ సమావేశం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి చేబ్రోలు , తెనాలి రూరల్

ఉపాధ్యాయులు సామాజిక చైతన్యానికి పునాదులని, అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలు కలిగిన యుటిఎఫ్ ఐక్యతతో ఉద్భవించిందని, అదేవిధంగా కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గుంటూరు జిల్లా 51వ కౌన్సిల్ సమావేశం ఆదివారం చేబ్రోలులో ఆర్‌విఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు రాజశేఖర్ అధ్యక్షతన సభలో లక్ష్మణరావు ప్రసంగించారు. ముందగా జాతీయజెండా, ఎస్‌టిఎఫ్ఐ జెండా, యుటిఎఫ్ జెండాలను నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు , యు. టి.ఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి ప్రభుదాసు, చేబ్రోలు యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఆర్.వి. సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. సమావేశ ప్రారంభానికి ముందు ఉపాధ్యాయులు కోలాటం ప్రదర్శనలో పాల్గొని విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో కె ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్లైన్ యాప్‌ల విధానంతో ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో విద్యార్థులకు ఉపాధ్యాయునికి మధ్య దూరం పెరుగుతుందని ఇది భవిష్యత్తుకు అంత మంచిది కాదని ఆయన వ్యాఖ్యానించారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించాలనే పేరుతో కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు ఇవ్వడం అనౌచిత్యం అని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై అనుసరిస్తున్న విధి, విధానాలను ఆయన తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. పోరాటాలు ఉద్యమాలు చేస్తున్న వారిని ఎన్‌కౌంటర్ చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని ప్రభుత్వాలను ఈ సందర్భంగా ఆయన కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎస్ ప్రసాద్, మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే బాధ్యత యుటిఎఫ్ నెరవేరుస్తుందని, అన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సిపిఎస్ , యు పి ఎస్ , జి పి ఎస్ రద్దు చేసి , పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. డిసెంబరు18న గుంటూరు జిల్లా కలెక్టరేట్ దగ్గర టెట్, (ఎస్‌టిఎస్) సింగల్ టీచర్ స్కూల్స్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, వందరోజుల యాక్షన్ ప్లాన్ అంశాలపై ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులందరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ వి కృష్ణయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం మా కళాశాలలు జరగటం ఆనందంగా ఉందని అన్నారు . తను విద్యార్థిగా ఉన్నప్పుడు రోజులు గుర్తు చేస్తూ, అప్పటికి ఇప్పటికి విద్యార్థుల్లో, కాలానుగుణంగా వచ్చిన మార్పులపై మాట్లాడుతు పెడదారి పడుతున్న విద్యార్థి జీవన గమనాన్ని సరైన దారిలో పెట్టే ఏకైక మార్గం ఉపాధ్యాయ వృత్తి అని ఇది ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ఉమ్మడి కార్యాచరణతోనే సాధ్యమన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సామాజిక పోరాటాల్లో, ఆందోళనల్లో యు.టి. ఎఫ్ ముందువరుసలో ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై యుటిఎఫ్ కు సిఐటియు పూర్తి సహకారం అందిస్తుందని లక్ష్మీనారాయణ అన్నారు.

మహాసభలో యుటి ఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు , రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ నాయుడు , రాష్ట్ర అధ్యయన కమిటీ సభ్యులు ఎన్ కుమార రాజా , ఎం వి ఎస్ పబ్లిక్ స్కూల్ గుంటూరు ప్రిన్సిపల్ మరియు యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కోశాధికారి శ్రీ యన్ తాండవకృష్ణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష యు రాజశేఖర్ రావు ,ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్ , సహ అధ్యక్షురాలు వై నాగమణి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పివి శ్రీనివాసరావు, సహ అధ్యక్షులు వెంకటేశ్వర్లు , కోశాధికారి యం డి దౌలా, జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షులు ఖాదర్బాషా , ప్రధాన కార్యదర్శి పార్థసారథి జిల్లాలోని జిల్లాలోని అన్ని మండలాలు పట్టణాలు మున్సిపాలిటీలో ఉపాధ్యాయులు యుటిఎఫ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పలు తీర్మానాలు ఆమోదం

ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, పదోన్న తులు కల్పించాలని, 2010 కంటే ముందు నియా మకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, 12వ పిఆర్‌సి కమిషన్ పునరుద్ధరించాలని, 29శాతం ఐఆర్ ప్రకటిం చాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిం చాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెల్త్ కార్డులు సమస్యను వేగవం తంగా పరిష్కరించాలని తదితర తీర్మానాలకు మహాసభ ఏకగ్రీంగా ఆమోదించింది.







యుటిఎఫ్ గుంటూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా యు రాజశేఖరరావు , ఎం కళాధర్


యు. రాజశేఖరరావు,


ఎం కళాధర్

ఆంధ్రప్ర దేశ్ ఐక్య ఉపా ధ్యాయ ఫెడరేషన్ గుంటూరు జిల్లా 51వ కౌన్సిల్ సమావేశం అనంతరం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన జిల్లా కార్యవర్గ కమిటీ ఎన్నిక – ఎన్నికల కార్యనిర్వహణ అధికారిగా ఎస్ఎస్ నాయకుడు వ్యవహరించి 16 మంది ఆఫీస్ బేరర్లుతో కూడిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులు పి.వి శ్రీనివాసరావు, అధ్యక్షులు యు రాజశేఖర్‌రావు, సహ అధ్యక్షులు జి వెంకటే శ్వర్లు, ఎండి షకీలా బేగం , ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్, కోశాధికారి ఎం.డి. గయా సుద్దౌలా, జిల్లా కార్యదర్శులుగా సిహెచ్ ఆదినారాయణ, కె సాంబశివరావు, టి ఆంజనేయులు కె కామాక్షి, ఎం గోవిందయ్య, జి వెంకటేశ్వ రరావు, కె రంగారావు, కె కేదార్నాథ్, బి ప్రసాద్, ఎం కోటిరెడ్డి ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ చైర్మన్‌గా అడవి శ్రీనివాసరావు, సభ్యులుగా కె ప్రేమ్ కుమార్, ఎన్ ధనలక్ష్మి, కె వి ఎస్ ఎన్ కోటేశ్వరరావు, వి వినోద్ ఎన్నికయ్యారు.


మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రజాశక్తి – మంగళగిరి

కార్మిక వర్గానికి నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ పై కార్మిక వర్గాన్ని సంఘటిత పరిచి ఉద్యమిస్తామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. ఆదివారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని అన్నారు. వీటి వలన కార్మిక హక్కులు రద్దు అవుతున్నాయని అన్నారు. కనీస వేతన చట్టం అమలు జరగదని అన్నారు. పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా అమలు జరగదని కనీస వేతనాలు అత్యంత తక్కువగా వస్తాయని అన్నారు. కార్మికులకు సమ్మె చేసే హక్కు, నిరసన తెలియజేయడానికి అవకాశం ఉండదని అన్నారు. పని గంటలు పెరుగుతాయని అన్నారు. బీహార్‌లో ఎన్నికల జరిగిన తర్వాత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనేక ప్రజావ్యతిరేక విధానాలను ముందుకు తీసుకెళుతుందని అన్నారు. ఎస్ఐఆర్ వలన బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించే అవకాశం ఉందని అన్నారు. వచ్చే సంవత్సరం 9 రాష్ట్రాల్లో ఎన్నికల జరుగుతున్నాయని తెలిపారు. ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ను అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని అన్నారు. ఇప్పటికే బెంగాల్లో అమలు చేసి 44 లక్షలు ఓట్లు తొలగించడం జరిగిందని అన్నారు. అందువలన ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నారని అన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు ఇస్తానని మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదని విమర్శించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ మాట్లాడుతూ పట్టణంలో 5000 మందికి పైగా ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందని అన్నారు. రెండు నెలల క్రితం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఇళ్లస్థలాల అర్జీలు అందజేయడం జరిగిందని తెలిపారు. కార్పొరేషన్ అధికారులు స్లిప్పులు ఇచ్చారని తెలిపారు. వెంటనే దరఖాస్తులను పరిశీలించి పేద ప్రజలకు నివేశన స్థలాలు ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవా లని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలు విశాఖపట్నంలో జరుగుతున్నాయని, జనవరి 4వ తేదీన జరిగే బహిరంగ సభకు ఈ ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో కార్మిక వర్గం తరలి వెళ్ళడానికి విస్తృత ప్రచారం చేస్తున్నామని అన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ పాల్గొన్నారు.

నగదు రహిత చెల్లింపులపై ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల అవగాహన

ప్రజాశక్తి–గుంటూరు

స్థానిక గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ రెండు, మూడు యూనిట్ల ఆధ్వర్యంలో స్థానిక 23వ డివిజన్ 81, 82 సచివాలయాల పరిధిలోని గుండారావుపేట చెక్కబజారు, జెండా చెట్టువీధి, వడ్డె గూడెం పరిసర ప్రాంతాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా ఆదివారం వాలంటీర్లు నగదు రహిత చెల్లింపుల గురించి ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3 విభాగం వాలంటీర్లు మొక్కలు నాటారు. రెండు యూనిట్ల కార్యక్రమాలను గుంటూరు జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.వి సుధీర్‌కుమార్ సందర్శించి, పరిశీలించారు. వాలంటీర్లకు ఎన్‌ఎస్‌ఎస్ మోటో గురించి, సామాజిక బాధ్యత గురించి అవగాహన కల్పించారు. ఆరు రోజులు వాలంటీర్లు చేసిన వివిధ సేవా కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆఫీసర్లు డాక్టర్ డి.ధాత్రికుమారి, కె.సుబ్బరత్నం పర్యవేక్షించారు.



మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి – పెదకాకాని

వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మండల పరిధిలోని నంబూరు గ్రామంలో ఆదివారం ధాన్యం రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసు కున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 75 కేజీల ధాన్యం బస్తాకు రూ.1792 మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ కౌలు రైతులు గత్యంతరం లేని స్థితిలో ప్రైవేటు వ్యాపారులకు రూ.13వందలకే అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెదకాకాని మండలంలో కౌలు రైతులు రూ.20 వేల నుండి 30వేలు కౌలు చెల్లిస్తున్నారని ఎకరానికి ఖర్చు రూ. 30 వేలు అవుతుందని వ్యయ ప్రయాసలకు ఓర్చి పంట పండించిన రైతుకు గిట్టుబాటు ధర అందటం లేదన్నారు.ప్రభుత్వం ధాన్యంలో తేమ శాతం ఎక్కువ ఉంది అనే పేరుతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని, దీని వల్ల రైతులు ఎకరాకు రూ.10 వేల నుండి 12 వేలకు రైతులకు నష్టపోతున్నారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ మొంథా తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని,ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు,అప్పిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.





ఎమ్మెల్యేని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న లింగా బ్రహ్మయ్య

ఎమ్మెల్యే జూలకంటికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - దుర్గి


రాష్ట్ర ప్రభుత్వానికి తనను సిఫార్సు చేసి, దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎంపికచేయటం పట్ల పట్ల లింగా బ్రహ్మయ్య శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం యార్డు చైర్మన్ లింగా బ్రహ్మయ్య, పలువురు నాయకులు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనరెడ్డిని కలసి పుష్పగుచ్ఛమిచ్చి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా 18 మందితో నూతన కమిటీ సభ్యులను నియమించి రైతుల సంక్షేమాభివృద్ధి కోసం కృషి సల్పుతున్నందుకు ఎమ్మెల్యేను అభినందించారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో టిడిపి దుర్గి మండల అధ్యక్షులు దుగ్గంపూడి జానకి రామయ్య, టిడిపి సీనియర్ నాయకులు లింగా పుల్లయ్య, పార్టీ బలోపేతానికి కఅషి చేసిన టిడిపి యువ నాయకులు లింగా సాంబశివరావు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైన టి.ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి - దాచేపల్లి



స్థానిక ఎస్సీ కాలనీ మండల పరిషత్ ప్రాతమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న టి. ఆనంద్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యా ప్రతిభా పురస్కారానికి ఎంపి కయ్యారు. ఆయన వారధి ఫౌండేషన్ అధ్యక్షునిగా చేస్తున్న పలు సేవా కార్యక్రమాలకుగాను ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యలంలో (నాట్స్) ఆనంద్ కుమార్‌ను ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసింది. నెల 17వ గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేయ నున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్‌ను యుటిఎఫ్ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రెవెన్యూ డివిజన్ యూనిట్ అధ్యక్షుడిగా నాగరాజు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ యూనిట్ అధ్యక్షులుగా క్రోసూరు మండల తహసిల్దార్ వివి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ యూనిట్ ఎన్నికలు సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. మొత్తం 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి. 11మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా క్రోసూరు తహశీల్దార్ నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా బి. సుబ్బారావు, ఉపాధ్యక్షులు ఎన్.ధనలక్ష్మీ, ఓ.ఎస్.రాజశేఖర్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డి.వెంటేష్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.శ్యామలత, కె.వి.నరసింహారెడ్డి, కోశాధికారిగా షేక్ జానీ బాషా, కార్యనిర్వాహక సభ్యులుగా టి.హైమారావు, ఎన్. రత్నకుమార్, జిల్లా కౌన్సిలర్‌గా జి.అనితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ముప్పాళ్ళ తహశీల్దార్ కె.నగేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సత్తెనపల్లి ఆర్డీవో జి.రమణకాంతరెడ్డి ఎన్నికల అధికారి కె.నగేష్‌లు అభినందించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట డి.ఎస్.పి హనుమంతరావు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి కృష్ణారావు ఆదేశాల మేరకు నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడినా, నేరాలను ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.



రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న డి.ఎస్.పి

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని కోరుతూ కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీ షీట్ ఉన్నవారికి సమాజంలో ఏమాత్రం గౌరవం ఉండదని గ్రహించాలని అన్నారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీ షీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని అన్నారు. ఇటువంటి కౌన్సెలింగ్ ద్వారా నేరాలను అదుపులోకి తెచ్చి, శాంతి భద్రతలను పరిరక్షించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టామని డి.ఎస్.పి వివరించారు. కార్యక్రమంలో సిఐ సుబ్బారావు, ఎస్ఐ కిషోర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిపిపిపై కేంద్ర నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం : కొమ్మాలపాటి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందు చూపుతో తీసుకువచ్చిన పి.పి.పి విధానానికి కేంద్రం పూర్తి సానుకూలంగా ఉండటం పట్ల టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.ఆదివారం టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమ్మాలపాటి మాట్లాడుతూ పార్లమెంటు స్థాయి సంఘం సిఫార్సులతో ముఖ్యమంత్రి నిర?యం ఎంత విలువ అయిందో మరోసారి నిరూపితమైందన్నారు. పిపిపి విధానంతో రాష్ట్ర వైద్య రంగంలో పెను మార్పులు వస్తాయన్నారు. ప్రజలకు వైద్య రంగంలో సౌకర్యవంతమైన సేవలు అందుతాయన్నారు. ప్రజలకు వైద్య రంగంలో నాణ్యతతో కూడిన సౌకర్యవంతమైన సేవలు అందుతాయన్నారు. వైసిపి నాయకులు చేస్తున్న అవాస్తవ ప్రచారంపై ప్రజలు తిరగబడుతున్నారన్నారు. ఆరాటేం, మనుగడ కోసం ధర్నాలతో ప్రజలను మోసం చేయలేరని వైసిపిని ప్రజలు తిరస్కరించి 11 సీట్లకు పరిమితం చేశారని గుర్తు చేశారు. తప్పుడు సంతకాలు, క అత్రిమ ఉద్యమాలు ఇప్పటికైనా మానుకోవాలని వైసిపి నేతలకు హితవు పలికారు. కోట్ల రూపాయల వ్యయం ఖర్చు చేసి వైద్య విద్య కోసం మన విద్యార్థులు విదేశాలకు వెళ్ళటం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రం లోనే ఉన్నతమైన ప్రమాణాలతో వైద్య విద్యను అందుబాటులోకి తీసుకువచ్చే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్నారన్నారు. అమరావతి పున్ణ నిర్మాణం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు.





ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పరిసరాలను శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

బ్రహ్మనందపురం తండాలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన బ్రహ్మండపురం తండాలో నిర్వహిస్తున్న 7 రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం విజయవంతంగా, ఉత్సాహంగా కొనసాగుతోంది. శిబిరం ప్రారంభమైన నాటి నుంచి ఐదు రోజులుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామాభివృద్ధి, సామాజిక చైతన్యం లక్ష్యంగా వివిధ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. శిబిరం నిర్వహణను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ షేక్ మొహమ్మద్ భాష పర్యవేక్షిస్తూ ముందుకు తీసుకెళుతున్నారు. ఆయన నాయకత్వంలో వాలంటీర్లు క్రమశిక్షణతో, సేవాభావంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. శిబిరంలో భాగంగా గ్రామంలోని డ్రైనేజీల శుభ్రపరిచే కార్యక్రమం, పిచ్చి మొక్కల తొలగింపు, ప్రాంతాల పరిశు భ్రత, సేవాలాల్ గుడి పరిసరాల శుభ్రత, గ్రామ సర్వే నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామంలో పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతోంది. సాయంత్రం పూట నిర్వహించిన వినోదం అవగాహన కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మూఢనమ్మకాల నిర్మూలన, బాల్య వివాహాల దుష్పరిణామాలు అనే అంశాలపై ప్రభావవంతమైన స్కిట్స్ ప్రదర్శించారు. ప్రతిరోజు సాయంత్రం గ్రామస్తులతో కలిసి వివిధ రకాల ఆటల పోటీల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గంటూ, గ్రామస్తులు - వాలంటీర్ల మధ్య మంచి ఐక్యత, స్నేహభావం, పరస్పర అనుబంధం ఏర్పడుతోంది. ఈ కార్యక్రమాలు శిబిరానికి మరింత ఉత్సాహాన్ని చేకూర్చుతున్నాయి. అదేవిధంగా, సంస్క అతిక కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గని తమ ప్రతిభను ప్రదర్శిస్తూ గ్రామస్తులను ఆకట్టుకున్నారు. పాటలు, న అత్యాలు, నాటికలు వంటి కార్యక్రమాల ద్వారా శిబిరం పండుగ వాతావరణంలో కొనసాగుతూ, గ్రామంలో సాంస్క అతిక చైతన్యాన్ని పెంపొందిస్తోంది. ఈ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం గ్రామాభివ అద్ధికి తోడ్పడుతూ, వాలంటీర్లలో సేవాభావం, సామాజిక బాధ్యతను మరింత బలపరుస్తోందని గ్రామస్తులు మరియు నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

గోల్డెన్ జానీ మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక టిడిపి సీనియర్ కార్యకర్త గోల్డెన్ జానీ మృతి చెందారు. విషయం తెలుసుకొన్ని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ జానీ భౌతికకాయానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. జానీ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పలువురు టిడిపి నాయకులు నివాళులు అర్పించిన వారిలో వున్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పిపిపి విధానంలో నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని పల్నాడు జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు భైరా పట్నం రామకృష్ణ పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జివో నెం. 590తో పాటు గతంలో తీసుకొచ్చిన జివోలు 107, 108లను రద్దు చేయాలని కోరారు. పిపిపి విధానం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు వైద్య విద్య దూరమవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యసేవలు, ఉద్యోగ భద్రత, రిజర్వేషన్ హక్కులు దెబ్బతింటాయని ఆయన హెచ్చరించారు. నూతన మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిసెంబర్ 18న రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించి, ప్రజలు, విద్యార్థులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రథమ మహాసభ

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏపిఎంఈఎఫ్) ఆధ్వర్యంలో ప్రథమ మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో ఏపిఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల రవికుమార్ చేతుల మీదుగా సంఘ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం సభను ప్రారంభించి ముఖ్య అతిథులు, వక్తల ప్రసంఘాలతో కార్యక్రమం కొనసాగింది. వక్తలు తమ ప్రసంగాలలో ఉద్యోగుల వేతనాలు, ఉద్యోగ భద్రత, సేవా నిబంధనలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై విస్తఅతంగా ప్రస్తావించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ఏపిఎంఈఎఫ్ సంఘం నిరంతరం కఅషి చేస్తుందని తెలిపారు. 12 ప్రధాన డిమాండ్లు పై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ మరియు లోకల్ బాడీ కమిటీలను ఏకగ్రీవంగా ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా కమిటి అధ్యక్షులుగా మాచర్ల కన్నయ్య , జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ మీరా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టెపోగు కనకయ్య ఎన్నుకున్నారు. లోకల్ బాడీ కమిటి అధ్యక్షులుగా చెరుకూరి గోపాల్, కార్యదర్శి బత్తిన అమర్, కోశాధికారిగా మక్కెన సీతయ్యతో పాటు ఇద్దరేసి చొప్పున ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శిలు, కార్యవర్గ సభ్యులును ఎన్నుకున్నారు. ఈ మహాసభకు పెద్ద సంఖ్యలో మున్సిపల్ ఉద్యోగులు, పారిశు ధ్య ఉద్యోగులు, ఆప్కో ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు సోమి శంకరరావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు ఎల్. కృష్ణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలేపల్లి అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖకే తలమానికంగా

తహశీల్దార్ కార్యాలయం

నేడు మంత్రుల చేతుల మీదుగా పున:ప్రారంభం



వైభవంగా ముస్తాబైన తాహశీల్దార్ కార్యాలయం, కె.వి. గోపాలకృష్ణ (ఇన్‌సెట్‌లో)

ప్రజాశక్తి - తెనాలి

తహశీల్దార్ కార్యాలయం అంగరంగ వైభవంగా ముస్తాబయింది. ఏడాది క్రితం తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన కె.వి.గోపాలకృష్ణ తనదైన శైలిలో కార్యాలయాన్ని ఆధునీకరించారు. దాదాపు ఆరు నెలలు అవిశ్రాంతంగా శ్రమించిన ఆయన అనుకున్న రీతిలో కార్యాలయాన్ని తీర్చిదిద్ద గలిగారు. ఎట్టకేలకు సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు భవన పున:ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేశారు. వివరాల్లోకి వెళితే 1982లో నిర్మితమైన పురాతన భవనంలో తహసిల్దార్ కార్యాలయం కొనసాగుతుంది. ప్రభుత్వ శాఖలలో ఎంతో ప్రాధాన్యత కలిగిన తహసిల్దార్ కార్యాలయానికి నిత్యం సందర్శకుల తాకిడి ఉంటుంది. ఇప్పటివరకు ఎంతోమంది తహసిల్దార్లు ఇక్కడ పనిచేసినప్పటికీ కార్యాలయం రూపు రేఖలు మార్చే ప్రయత్నం చేయలేదు. సందర్శకులు గంటలకొద్ది అధికారుల కోసం వేచి ఉన్న పరిస్థితుల్లో కనీస సదుపాయాలకు కూడా నోచుకోక ఇబ్బంది పడిన సందర్భాలు అనేకం. ఈ పరిస్థితులను అధ్యయనం చేసిన తహశీల్దార్ అన్ని విధాలా కార్యాలయాన్ని అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్నారు. తలచిందే తడవుగా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చించారు. దాతల సహకారాన్ని అందిపుచ్చుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి ఉన్న స్థలాన్ని ప్రహరీ గోడ నిర్మాణంతో భద్రం చేశారు. సందర్శకుల కోసం వెయిటింగ్ హాలు, రెవెన్యూ ఉద్యోగ సంఘ కార్యాలయంగా ఉన్న ప్రాంతాన్ని కూడా ఆధునీకరించి కాన్ఫరెన్స్ హాలుగా మార్చారు. వర్షం పడితే ప్రాంగణంలో నీరు నిలిచే పరిస్థితిని మార్చేందుకు ప్రాంగణం ఎత్తు పెంచారు. కార్యాలయంలో సిబ్బందికి ప్రత్యేకంగా క్యాబిన్లు ఏర్పాటు చేసి, పేరు హోదాతో బోర్డులను కూడా ఉంచారు. అన్నింటినీ మించి కార్యాలయం ముందు భారతీయ రాజముద్రను ప్రతిష్టింప చేశారు. సందర్శకుల వెయిటింగ్ రూమ్‌తో పాటు, మదర్ ఫీడింగ్‌కు వేరే గదిని ఏర్పాటు చేయించారు. అధికారుల కోసం సందర్శకులు వేచి ఉండాల్సి వచ్చినా ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించారు. మొత్తంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రెవెన్యూ శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేట్టు, ఆ శాఖకే తలమానికంగా, కార్పొరేట్ స్థాయిని మించి కార్యాలయం ముస్తాబయిందనటంలో ఏమాత్రం సందేహం లేదు.

సంస్కరణలతో ఆధునీకరించాం : కె.వి గోపాలకృష్ణ తహశీల్దార్ తెనాలి

తహశీల్దార్ కార్యాలయాన్ని గత వాతావరణానికి భిన్నంగా నూతన సంస్కరణలతో ఆధునీకరించాం. సిబ్బంది బాధ్యతతో స్పందించడం, వారి అవసరాన్ని తెలుసుకుని సహకరించడం, నిరక్షరాస్యులకు సమస్యను బట్టి అర్జీ కూడా రాసి ఇచ్చే విధంగా సిబ్బందిని అప్రమత్తం చేశాం. సందర్శకులు ఏ అవసరం ఉన్నా నన్ను నేరుగా కలవచ్చు.

ప్రారంభోత్సవంలో పాల్గొననున్న మంత్రులు

ప్రారంభోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో పాటు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి సాయి ప్రసాద్, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జి జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొననున్నారు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

376 రోజులుగా దీక్షలు కొనసాగిస్తున్న సిమెంట్ కార్మికులు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్టపరంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారనాటికి 376 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్, షేక్ సుభాని, బూరగ అంకయ్య, మండేపూడి ఆశీర్వాదం ప్రారంభించారు. దీక్షల్లో దామవరపు నాగేశ్వరావు, బొందలపాటి నవనీతమ్మ, మొలకా శారదా, బిదానయ్య, బి.సూర్యప్రకాష్ రావు కూర్చున్నారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ కార్మికులు ఒక్కరొక్కరే చనిపోతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని, మానవతా దృక్పథంతో ప్రభుత్వం పట్టించుకోని సమస్య పరిష్కారం చేయాలని కోరారు. న్యాయంగా తమకు రావలసిన నష్టపరిహారం ఇచ్చేవరకు న్యాయపోరాటం, నిరసన దీక్షలు కొనసాగిస్తామని అన్నారు.



క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్న జనని సీడ్స్ సిబ్బంది

కంద్రికలో జనని సీడ్స్ పత్తి క్షేత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని కంద్రిక గ్రామం లో రైతుల పొలాల్లో జననీ వారి జననీ -555 కంపెనీ ఆధ్వర్యంలో ప్రత్తి ప్రదర్శన క్షేత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ ప్రదర్శన క్షేత్ర కార్యక్రమానికి ప్రముఖ జోసిల్ కంపెనీ మేనేజర్ టి. వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. జనని-555 బిజీ -2 రకం అధిక వర్షాలతో వచ్చే తెగుళ్ల సైతం తట్టుకొని గులాబీ రంగు పురుగు మరియు చీడపీడలను తట్టుకొని మంచి పంటతో అధిక దిగుబడులను తెస్తుందని రైతులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. జనని- 555 రకం ప్రతికూల వాతావరణంలో కూడా అధిక కాపుతో ప్రత్తి తీతకు అనుకూలంగా ఉందని జెట్టి శ్రీనివాసరావు అనే రైతు తన పొలంలో ఏర్పాటుచేసిన ప్రత్తి ప్రదర్శన కార్యక్రమంలో పాల్గన్న రైతులకు తెలియజేశాడు. ఫిరంగిపురం, సత్తెనపల్లి, యడ్లపాడు, నాదెండ్ల, మేడికొండూరు మండలాల నుంచి సుమారు 1500 మంది రైతులు పెద్ద సంఖ్యలో క్షేత్ర ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బైక్ పై వచ్చి.. దర్జాగా గొలుసును తెంపుకొని వెళ్లి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో కొత్తపేటలోని అమ్మవారి గుడి వద్ద ఆదివారం ఓ వ అద్ధురాలి మెడలో గుర్తు తెలియని దుండగుడు బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. బాధితులు తెలిపిన సమాచారం మేరకు.. స్థానికంగా నివాసం ఉండే ఈశ్వరమ్మ అనే వ అద్ధ మహిళ ప్రతిరోజు సమీపంలోని అమ్మవారి గుడి ఎదుట శుభ్రం చేసి ముగ్గు వేసి వస్తుంటుంది.. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 6.35 నిమిషాలకు అమ్మవారి గుడి వద్ద యధావిధి గా తన కార్యకలాపాలను ముగించుకుని తిరిగి వస్తుండగా, గుర్తు తెలియని దుండగుడు ద్విచక్ర వాహనంపై వచ్చి వ అద్ధురాలి మెడలో బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. 96 గ్రాముల బరువు కలిగిన దీని విలువ సుమారు రూ.13 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సీసీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టారు.

ఘనంగా పోతినేని జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, రాష్ట్ర పద్మశాలియ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నందం అబద్దయ్య, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ బత్తుల హరిదాసు, రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండి ఇబ్రహీం, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్యం రమేష్ బాబు, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, మంగళగిరి పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ తదితరులు బొకేలు అందజేసి, శాలువాతో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. పలు ప్రాంతాల్లో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.



పోతినేని శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

గట్టుపల్లి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చేబ్రోలు

పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జన్మదిన వేడుకలను మండల ప్రధాన కేంద్రమైన చేబ్రోలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థిరాస్తి వ్యాపారస్తులు వింధ్యశ్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ గట్టుపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు . కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కూచిపూడి రవి శేఖర్ పాల్గని ఎమ్మెల్యే ధూళిపాళ్లకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . సందరరేగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో ఆరు ఎమ్మెల్యేగా గెలిచిన ధూళిపాళ్ల నరేంద్ర రైతు బాంధవుడు అన్నారు. రాష్ట్రంలో సీనియర్ ఎమ్మెల్యేగా విజయపథంగా ప్రజల మనసు గెలుచుకున్న బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన కొనియాడారు. నిత్యం ప్రజల అవసరాల కోసం శ్రమించే నాయకుడు ధూళిపాళ్ల అన్నారు. రాజకీయ చైతన్యానికి కేంద్రమైన గుంటూరు జిల్లా నుండి తండ్రి మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి, వారసత్వ రాజకీయ విలువలతో మొదలైన రాజకీయ నేపథ్యం తో అంచెలంచెలుగా ఎదిగి , ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజల మనిషి నరేంద్ర అని రైతు బంధువుగా ఆయన లక్షలాది రైతు కుటుంబాలకు, దశాబ్దాలుగా చైతన్యాన్నిస్తూ వున్న సంగం డెయిరీ చైర్మన్‌గా ఉన్నత ప్రమాణాలతో బాధ్యతలు నిర్వహిస్తూ, క్రమశిక్షణ గల ప్రజా నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో రామిశెట్టి శ్రీను, గట్టుపల్లి సుబ్బారావు, పసుపులేటి సుధీర్, స్థానిక టిడిపి కూటమి నాయకులు జనసేన నాయకులు అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నాని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కటింగ్ చేస్తున్న గట్టుపల్లి సుబ్రహ్మణ్యం

17న మంగళగిరిలో పెన్షనర్స్ డే

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 17వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో మంగళగిరిలో గల ఇందిరా కళామందిరంలో రజస్తోత్సవ మహాసభ.. సర్వసభ్య సమావేశం, పెన్షనర్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా మంగళగిరి అసోసియేషన్ అధ్యక్షులు వి.గోపిరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు పాల్గొంటారని తెలిపారు. పెన్షనర్లు పెద్ద సంఖ్య పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.



కేక్ కటింగ్ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే నరేంద్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం మండల కేంద్రంలోని కాకుమాను తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సంఘం డైరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి, కాకుమాను పిఎసిఎస్ చైర్ పర్సన్ నల్లమోతు వీరశంకర్ రావు, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పూర్ణచంద్రరావు, కాకుమాను సర్పంచ్ బోడపాటి శివప్రసాద్, స్థానిక పాల కేంద్రం అధ్యక్షురాలు తోకల పద్మజలక్ష్మి కేక్ కట్‌చేసి నరేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కేక్ కటింగ్ చేస్తున్న జిల్లాపరషత్ చైర్‌పర్సన్ క్రిస్టినా

ఘనంగా సెమీ క్రిస్మస్

ప్రజాశక్తి - తెనాలి

పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను స్థానిక జయప్రకాష్ నగర్ జియోన్ ఫెయిత్ సిటీ చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బిషప్ పాముల పరం జ్యోతి అధ్యక్షత వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్ మాట్లాడారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, విశిష్ట అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ కేకును కట్ చేసి ప్రజలకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ కుద్దూస్, మాస్ అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు, రెవరెండ్ సువర్ణరాజు, రెవరెండ్ అన్నం ఆదం, విలియం కేరి, పి.ఏసేపు, జె శ్రీకాంత్, రెవరెండ్ ఎం.షద్రక్, రెవరెండ్ గడ్డం జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సోమేపల్లి సాహితీ పురస్కారాలు అందుకున్న రచయితలు

రాజ్యాంగంలో కనపడని సమస్యలకు సాహిత్యమే పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం 16వ సోమేపల్లి సాహితీ పురస్కారాల సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ తెలుగు, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ ఆర్.డీ. విల్సన్ హాజరయ్యారు. రమ్యభారతి పత్రిక గౌరవ సలహాదారు వేముల హజరత్తయ్య గుప్తా అధ్యక్షతన జరిగిన సభలో విల్సన్ మాట్లాడుతూ మనలో అంతర్లీనంగా ఉన్న వున్న సాహిత్యాన్ని వెలికి తీయడానికి ఒక వేదికను ఏర్పాటుచేసిన మహావ్యక్తి సోమేపల్లి అని, అదే బాటలో ఆయన కుమారుడు శ్రీవశిష్ఠ నడుస్తున్నారని అన్నారు. రాజ్యాంగంలో లేని ఎన్నో సమస్యలను పరిష్కరించటానికి అత్యుత్తమ మార్గం సాహిత్యమే అన్నారు. సాహిత్యంలో మానవతా విలువలు ఉన్నప్పుడు రాణిస్తుందన్నారు. అనేక సంఘటనల సమాహారమే సాహిత్యం అంటూ చరిత్ర సష్టించ గలిగిన వారు, భావితరాలకు చరిత్ర అందించే వారు సాహిత్య వేత్తలన్నారు. అనంతరం కథల పోటీల విజేతలకు బహుమతులు అందేశారు. మొదటి బహుమతి 'గెలుపు' కథకు సింగరాజు శ్రీనివాసరావుకు, ద్వితీయ బహుమతి 'ఇకనైనా మారండి' కథకు జి.రంగబాబుకు, తృతీయ బహుమతి 'బేరం' కథకు బి.ఎస్.కే. కరీముల్లాకు అందచేశారు. ప్రోత్సాహక పురస్కారాలను మార్పు రావాలి కథకు ఇంద్రగంటి నరసింహమూర్తికి, సామాజిక నేరం కథకు సింహప్రసాదుకు, అమూల్య కథకు ఏం. వెంకటేశ్వరావుకు అందచేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు పాపినేని శివశంకర్, రావెలసాంబశివరావు, సిహెచ్. సుశీలమ్మ, పెనుగొండ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, తోటకూర వెంకట నారాయణ, చలపాక ప్రకాష్, శ్రీవశిష్ఠ, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.భవానిదేవీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఖాసిం, ఇతర ఉపాధ్యాయులు

ఉర్దూ బాషాభివృద్ధిపై రేపటి నుండి పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ ఏర్పాటు అయ్యి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి, భాషాభివృద్ధికి పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి ఎండీ ఖాసీం అన్నారు. ఆదివారం గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉర్దూ అకాడమీ సిబ్బందితో కలిసి వాల్‌పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలో సురూర్ బిఎబి ఉర్దూ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈనెల 16వ తేదీన 9-12 తరగతి విద్యార్థులకు ఉర్దూ భాష అభివద్ధిపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 17వ తేదీన ఉర్దూ కాలిగ్రఫీ పోటీలు, 18న క్రికెట్ పోటీలు, 19న ఉర్దూ భాష అభివద్ధిపై ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల అనంతరం ఈనెల 20న విజయవాడ తుమ్మపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఉర్దూ అకాడమీ చైర్మన్ చేతుల మీదుగా బహుమతుల కార్యక్రమం ఉంటుందన్నారు. కావున ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల్ని ప్రోత్సహించి, పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొనే విధంగా కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో గుంటూరు, మంగళగిరి, తెనాలికి చెందిన ఉర్దూ అకాడమీ సిబ్బందితోపాటు సీనియర్లు షేక్ అక్బర్, షేక్ రఫీ పాల్గొన్నారు.

వీధి దీపాలన్నీ వెలిగేలా చర్యలు

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలన్నీ వెలిగేలా విభాగాధిపతులు, సీనియర్ అధికారులతో పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. విధులు కేటాయించబడిన అధికారులతో కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ నగరంలోని ప్రతి అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)ల పరిధి వారీగా వీధి దీపాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సంబంధిత విభాగాధిపతులు, సీనియర్ అధికారులకు ప్రత్యేకంగా పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించామని తెలిపారు. ఆయా అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో రాత్రి సమయంలో తప్పనిసరిగా పర్యటించి, వీధి దీపాల వాస్తవ స్థితిగతులను సమగ్రంగా పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో ఉన్న మొత్తం వీధి దీపాల సంఖ్య, సక్రమంగా పనిచేస్తున్న దీపాల సంఖ్య, పనిచేయని లేదా మరమ్మతులు అవసరమైన దీపాల వివరాలు, అలాగే ప్రజల అవసరాలను దష్టిలో ఉంచుకొని కొత్తగా ఏర్పాటు చేయాల్సిన వీధి దీపాల సంఖ్యను స్పష్టంగా గుర్తించి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వీధిదీపాల సక్రమ నిర్వహణ ప్రజాభద్రత, రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా, నేరాల నియంత్రణలోనూ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.కనుక వీధిదీపాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. పనిచేయని వీధి దీపాలను తక్షణమే మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట్ల కొత్తలైట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుంటూరులో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

అమృత్-2 నిధులతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

విలీన గ్రామాల ప్రక్రియపై కలెక్టర్‌కు నివేదిక : ప్రజాశక్తితో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు





గుంటూరు నగరంలో రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. రానున్నఏడాది కాలంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. గత ఏడాదిన్నర కాలంలో గుంటూరులో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఆయన వివరించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

గుంటూరులో తాగునీటి సమస్య?

ప్రస్తుతం గుంటూరులోని 90 శాతం ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందుతోంది. తరచూ లీకేజిలు, ఇతర మరమ్మతుల వల్ల అంతరాయం కలుగుతోంది. శివారు ప్రాంతాలకు తాగునీటి సమస్య ఉంది. దీనిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ -2 పథకం ద్వారా గుంటూరుకు రూ.363 కోట్లు కేటాయించాయి. అలాగే అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ అభివృద్ధి నిధి ద్వారా రూ.212 కోట్లు కేటాయించారు. మొత్తంగా రూ.575 కోట్లతో నగరంలో శాశ్వత ప్రాతిపదికన పూర్తి స్థాయిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. ప్రధానంగా 2012లో విలీనం అయిన 10 గ్రామాలకు కూడా తాగు నీరు పూర్తిగా అందించేందుకు వీలవుతుంది. గోరంట్ల కొండపై నిర్మిస్తున్న రిజర్వాయర్ పూర్తవుతుంది. గుంటూరుకు చుట్టూ ఉన్న గ్రామాలు, ఇతర ప్రాంతాలకు తాగునీటిని పూర్తి స్థాయిలో అందించేందుకు ఈ నిధులు వినియోగిస్తాం.

నగరంలో రోడ్ల మెరుగుదలకు చర్యలు?

నగరంలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, గుంతలను పూడ్చేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు. పరిపాలన సమస్యలు కాంట్రాక్టర్ల ఇబ్బందులు, అధిక వర్షాలు వంటి సమస్యలు ఉన్నాయి. నగరంలో అన్ని ప్రాంతాల్లో సమాన ప్రాధాన్యతతో నిర్మాణాలు జరుగుతున్నాయి.

నిధుల కొరతపై ఎమ్మెల్యేల అసంతృప్తి?

నగరంలోని మూడు నియోజకవర్గాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించాం. గుంటూరు తూర్పునియోజకవర్గానికి రూ.210 కోట్లతో 761 పనులు చేపట్టాం. పశ్చిమ నియోజకవర్గంలో రూ.260 కోట్లతో 1010 పనులు, ప్రత్తిపాడు నియోజకవర్గంలోని విలీన గ్రామాల్లో 710 పనులకు రూ.196 కోట్లు కేటాయించారు. మొత్తం 2480 పనులకు రూ.666 కోట్లు కేటాయించారు. ఈ నిధులన్నీ డ్రైన్లు, రోడ్లకే కేటాయించాం. వీటిల్లో ఇప్పటికే రూ.257 కోట్ల చెల్లింపులు కూడా జరిగాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొన్ని రోడ్లు ఆర్‌అండ్‌బికి చెందినవి. వాటిని నగర పాలక సంస్థలో కలపని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదు. అందువల్ల కొన్ని రోడ్ల మరమ్మతులకు జాప్యం జరిగింది.

కొత్తగా విలీన గ్రామాల ప్రక్రియ?

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలకు, నగరాలకు సమీపంలో ఉన్న గ్రామాలను విలీనం చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, ఈ ప్రక్రియను ఈనెల 31లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారికి లేఖ రాశారు. గుంటూరు రూరల్ మండలంలోని 11 గ్రామాలను విలీనం చేసేందుకు వారు పంచాయతీల తీర్మానంతో ప్రతిపాదనలు పంపారు. దీనిపై కౌన్సిల్‌లో భిన్నాభిప్రాయలు వచ్చాయి. గుంటూరుకు సమీపంలో ఉన్న గ్రామాలను విలీనం చేయ కుండా దూరంగా ఉన్న గ్రామాలను విలీనం చేయడంపై కొన్ని అభ్యంతరాలు వచ్చాయి. ఈ అంశాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు?

నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయడానికి త్వరలో రెండు టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేయనున్నాం. ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినా ఆచరణలో అనేక ఇబ్బందులను పరిశీలిస్తున్నాం. పూర్తి స్థాయిలో నిషేధం అమలుకు చర్యలు తీసుకుంటాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎముకలు, కీళ్ల వ్యాధి నివారణకు అధునాతన చికిత్సలు

ప్రజాశక్తి-గుంటూరు

ఎముకలు, కీళ్ల వ్యాధి నివారణకు అధు నాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని ఆర్థోపెడిక్ సర్జన్ పి.కృష్ణప్రసంత్ అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ పి.కృష్ణస్రవంత్ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడుతూ వెనకటి రోజుల్లో కీళ్ల సమస్యలు వస్తే ఇంటికే పరిమితం అయ్యే పరిస్థితి ఉండేదని ఇప్పుడు అధునాతన వైద్య సహాయంతో, ఆర్థోపెడిక్ వ్యాధులు, సమస్యలు తొలగించు కొని మంచి జీవితాన్ని తిరిగి పొందే అవకాశం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా పెద్దవారిలో మూడు రకాల ఆర్థోపెడిక్ సమస్యలు వస్తాయని మోకాళ్ళ అరుగుదల, వెన్ను సమస్యలు, ఆస్టియోపొరోసిస్ అని తెలిపారు. మోకాళ్ళ అరుగుదల సమస్య గురించి వివరిస్తూ, మోకాళ్ళ అరుగుదల నిర్ధారణ అయినంత మాత్రాన శస్త్రచికిత్స చేసుకోవలసిన అవసరం లేదని, అరుగుదల వల్ల రోజువారీ కార్యక్రమాలు చేసుకోవటానికి ఇబ్బంది కలిగినప్పుడు మాత్రమే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. మోకాళ్ళ అరుగుదల తొలి దశలో ఉన్న వారికి గానీ, 50 సంవత్సరాల లోపు వారిలో గాని గుజ్జుబట్టే టాబ్లెట్ల వల్ల కొంత మేలు ఉంటుంది, కానీ 60 సంవత్సరాలు దాటిన తర్వాత ఆ టాబ్లెట్ల వల్ల ఉపయోగం ఉండదన్నారు. మోకాళ్లలో కార్టిలేజ్ పొర దెబ్బతిన్నప్పుడు ఆపరేషన్ చేయాల్సి వస్తుందని, ఆ కార్టిలేజ్ పొర కొంత వరకు ఉన్న సందర్భాలలో కొన్ని ఇంజక్షన్స్ ద్వారా వైద్యం అందించవచ్చన్నారు. వెల్లికిలా పడుకున్నప్పుడు మోకాళ్ళ కింద దిండు వేసుకోవడం, ఒక పక్కకు తిరిగి పడుకున్నప్పుడు రెండు కాళ్లమధ్య దిండు వేసుకోవడం లాంటి చిన్నచిన్న చిట్కాల ద్వారా కార్టిలేజ్ దెబ్బతిన కుండా ఉంటుందన్నారు. మధ్యపాదం భూమికి తాకే విధంగా కాకుండా మునివేళ్ళు, మడమపై ఆధారంగా నడవడం అలవాటు చేసుకుంటే మోకాళ్ళపై ఎక్కువ ఒత్తిడి కలగకుండా కార్టిలేజ్ దెబ్బతినకుండా ఉండే అవకాశం ఉంటుం దన్నారు. వెన్నుపూస గురించి తెలియజేస్తూ మనం కూర్చునే భంగిమ సరిగా లేకుంటే డిస్కులు ఎక్కువ ఒత్తిడి పడి వెన్నుపూసలు డిస్కులు జరగడం, డిస్క్ అరగడం జరుగుతుంది, అలా జరిగిన సందర్భంలో వెన్నుపూస



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణస్రవంత్

నుంచి కాలులోకి వచ్చే సయాటికా అనే నరాలపై ఒత్తిడి కలిగి కాలు నొప్పి వస్తుందన్నారు. ఒకే భంగిమలో ఎక్కువ సమయం కూర్చోకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్య రాకుండా నివారించ వచ్చన్నారు. సాధారణంగా వెన్నుపూస చుట్టూ ఉండే కండరాలు బలపరిచే వ్యాయామాలు చేయక పోవడం వల్ల కూడా డిస్క్ ప్రాబ్లం వస్తుందన్నారు. ఆస్టియోఫోరోసిస్ గురించి వివరిస్తూ ఎముకలలో క్యాల్షియం శాతం తగ్గడం వల్ల ఈ సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. కావున మనం తీసుకునే ఆహారంలో కాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పన్నీర్, కోడిగుడ్లు, నువ్వులు లాంటివి తీసుకోవాలన్నారు. ధూమపానం, మద్యపానం, కాఫీ వంటి అలవాట్లు వల్ల శరీరంలో క్యాల్షియం శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. స్విమ్మింగ్, సైక్లింగ్, వాకింగ్, జాగింగ్, ట్రెడ్మిల్ వంటి వ్యాయామాల వల్ల వెన్నుపూసకు, మోకాళ్ళకు సమస్య రాకుండా ఉంటుందన్నారు. మెడ నొప్పి గురించి వివరిస్తూ ఈ సమస్య మనం కూర్చునే పొజిషన్ ,సెల్, టీవీలు చూసే భంగిమల వల్ల ఎక్కువగా వస్తుంది, మెడ బాగా వంచి చూడడం తగ్గించుకుంటే ఈ సమస్య రాకుండా చేసుకోవచ్చన్నారు. అనంతరం డాక్టర్ పి కృష్ణస్రవంత్‌ను అవగాహన సభ్యులు సత్కరిం చారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకుడు కె.చంద్రశేఖరరావు, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత మేనేజర్ ఫణికుమార్, ఆదిత్య హాస్పిటల్ పి.ఆర్.ఓలు షేక్ కరీముల్లా, నూరుల్ పాల్గొని ప్రసంగించారు.